## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి భూమి పూజ

సదుం: మండలంలోని పొట్టెంవారిపల్లెలో గ్రామస్తులు మల్లీశ్వరస్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు.

### తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

కుప్పం: కార్తీక పౌర్ణమి దీపోత్సవం సందర్భంగా తిరువణ్ణామలైకి కుప్పం నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ పెంచులయ్య తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు సర్వీసులు నేరుగా తిరువణ్ణామలై వెళతాయన్నారు.

### వ్యవసాయ పనిముట్ల పంపిణీ



సోమల: ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వాటర్ షెడ్ వైస్ చైర్మన్ పీఎల్ఆర్ రాజారెడ్డి తెలిపారు. ఆయన శనివారం వాటర్ షెడ్ పథకంలో భాగంగా సోమల, ఇరికిపెంటకు చెందిన ఆరుగురు రైతులకు సబ్సిడీపై ఆయిల్ ఇంజిన్, చాఫ్ కట్టర్, బ్యాక్టరీ తైవాన్ కట్టర్లను అందజేశారు. వాటర్ షెడ్ పీవో శోభారాణి పాల్గొన్నారు.

### ఘనంగా శనిత్రయోదశి పూజలు

పలమనేరు: పట్టణంలోని గంటావూరు సమీపంలోని నవాలయంలో శనివారం శనిత్రయోదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఏలినాటి శని, అర్ధాష్టమ శని ప్రభావంతో బాధపడుతున్న వారు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి వారికి తైలాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

### పాఠశాల తనిఖీ

సోమల: మండలంలోని తమ్మినాయనిపల్లె పంచాయతీ ప్యాగలవారిపల్లె ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో- 2 శివరత్నమ్మ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు.

### కంటి అద్దాల పంపిణీ



సోమల: మండలంలోని కందూరు ఉన్నత పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులకు శనివారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కంటి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యాధికారిణి డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ గతంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. ఎంపీహెచ్ఈఓ కుమార్, హెచ్ఎం వెంకటరమణారెడ్డి, సూపర్‌వైజర్ ప్రమీలమ్మ పాల్గొన్నారు.

### హెల్త్ కార్డులు..



వి.కోట: వి.కోట మేజర్ పంచాయతీ సచివాలయం-1 పరిధిలో శనివారం సర్పంచ్ పిఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు చేతుల మీదుగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ ప్రజలకు వైఎస్సార్ ఆరోగ్య సంరక్షణ పథకం కింద హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈవో యాదవపతి, వార్డు సభ్యుడు కుమార్‌రాజా, వలంటీర్ స్వాతి పాల్గొన్నారు.

### వైభవంగా అంబలం పూజ

బైరెడ్డిపల్లి: మండలంలోని శెట్టిపల్లెలో శనివారం అయ్యప్ప భక్తులు అంబలం పూజ ఘనంగా నిర్వహించారు. మండపాలను విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అయ్యప్ప, వినాయక, సుబ్రమణ్యస్వాముల చిత్రపటాలను కొలువుదీర్చారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి నిప్పులపై నడిచారు. అయ్యప్ప భక్తులకు గ్రామస్తులు అన్నదానం చేశారు.

### యోగాతో మానసిక ఒత్తిడికి చెక్

గుడుపల్లె: యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి నుంచి దూరం చేసుకోవచ్చని ప్రభుత్వ ఆయుర్వేదిక్ యోగా నిర్వాహకులు గణేష్ తెలిపారు. కేజీబీ గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు యోగాసనాలు వేసి అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రతి రోజూ ఒక గంట యోగా చేయాలని సూచించారు.

### రూ.13.44 లక్షలు మంజూరు

రొంపిచెర్ల: మండలంలోని 14 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కోసం ప్రభుత్వం రూ.13.44 లక్షలు మంజూరు చేసిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష తెలిపారు. రొంపిచెర్ల-1కు రూ.1.36 లక్షలు, రొంపిచెర్ల-2కు రూ.1.07 లక్షలు, ఫజులుపేటకు రూ.1.60 లక్షలు, జొండ్లవారిపల్లెకు రూ.95 వేలు, మేకలవారిపల్లెకు రూ.31 వేలు, వంకిరెడ్డిగారిపల్లెకు రూ.1.21లక్షలు, చెంచెంరెడ్డిగారిపల్లెకు రూ.1.58 లక్షలు, వారణాసివారిపల్లెకు రూ.31 వేలు, జగడంవారిపల్లెకు రూ.1.60 లక్షలు, కోండారెడ్డిగారిపల్లెకు రూ.31 వేలు, లోకవారిపల్లెకు రూ.79 వేలు, పాళ్యంవీధికి రూ.1.21 లక్షలు, ఆర్.బెస్తపల్లెకు రూ.39 వేలు, చెన్నారెడ్డిగారిపల్లె కు రూ.79 వేలు వచ్చినట్టు తెలిపారు. తల్లిదండ్రులతో కమిటీలు ఏర్పాటు చేసి పనులు చేపడతామన్నారు.

# హోరాహోరీగా కబడ్డీ పోటీలు

- ఫ్లడ్ లైట్ల వెలుగులో రాత్రంతా సాగిన వైనం
- నేటితో ముగియనున్న పోటీలు



పోటీల్లో తలపడిన చిత్తూరు - కడప బాలికల జట్లు





తలపడిన కృష్ణ- విజయనగరం జట్లు, పోటీ పడుతున్న వెస్ట్ గోదావరి- అనంతపురం జట్లు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి అండర్ 17 అంతర్ జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీలు రెండవ రోజైన శనివారం హోరాహోరీగా సాగాయి. ఇందులో 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. క్రీడలను వీక్షించడానికి వచ్చిన ప్రేక్షకులు, క్రీడాభిమానులతో ఉన్నత పాఠశాల క్రీడా మైదానం కిటకిటలాడింది. పోటీలు ఉదయం 9 నుంచి రాత్రి వరకు సాగాయి. జట్ల వివరాలను కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.రామచంద్ర వెల్లడించారు. బాలుర విభాగంలో కడప-కృష్ణ జిల్లాల జట్లు తలపడగా 46-46 పాయింట్లు సాధించాయి. తూర్పుగోదావరి జట్టు 44 పాయింట్లు సాధించగా అనంతపురం జట్టు 57 పాయింట్లతో విజయ కేతనం ఎగురవేసింది. అలాగే గుంటూరు - నెల్లూరు జట్లు మధ్య జరిగిన పోరులో రెండూ 50-50 పాయింట్లు సాధించాయి. విశాఖపట్టణం - కర్నూలు మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు 23 సాధించగా 57 పాయింట్లతో విశాఖ విజయం సాధించింది. వెస్ట్ గోదావరి 48 పాయింట్లు సాధించగా ప్రకాశం జట్టు 50 పాయింట్లతో విజయ దుందుభి మోగించింది. విజయనగరం - కృష్ణ మధ్య జరిగిన పోరులో విజయగనరం 17 పాయింట్లు సాధించగా కృష్ణ 44 పాయింట్లతో విజయం కైవసం చేసుకుంది. శ్రీకాకుళం - అనంతపురం జట్లు తలపడగా అనంతపురం 29 పాయింట్లు, శ్రీకాకుళం 63 పాయింట్లతో విజయం సాధించింది. అలాగే కర్నూలు-నెల్లూరు జట్లు 22-48 పాయింట్లు కొనసాగించాయి. బాలికల విభాగంలో విశాఖపట్టణం - నెల్లూరు జట్లు 43-44తో హోరాహోరీగా తలపడ్డాయి. గుంటూరు- ఈస్ట్ గోదావరి 52-56 పాయింట్లు సాధించాయి. వెస్ట్ గోదావరి - ప్రకాశం 51-21 పాయింట్లు సాధించాయి. విజయనగరం - కృష్ణ జట్లు 42-37 పాయింట్లను సాధించాయి. చిత్తూరు - కడప జట్లు 58-8 పాయింట్లు, కర్నూలు - నెల్లూరు జట్లు 45-39, శ్రీకాకుళం - ఈస్ట్ గోదావరి జట్లు 51-11, కృష్ణ -ప్రకాశం జట్లు 22-40 పాయింట్లు, చిత్తూరు - అనంతపురం జట్లు 74-21 పాయింట్లతో విజయం సాధించాయి. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడా జట్లు క్వార్టర్ ఫైనల్, సెమీస్ పోటీలకు సిద్ధం అయ్యాయి. పోటీలు ఫ్లైడ్ లెట్ల వెలుగులో రాత్రి కూడా కొనసాగుతున్నాయి. ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. ఆదివారం ఫైనల్ పోటీల్లో విజయం సాధించిన జట్లకు ట్రోఫీలు అందజేయనున్నారు. కార్యక్రమంలో విజయవాణి విద్యాసంస్థల అధినేత నాయుని చంద్రశేఖర్‌మూర్తి, పీడీలు వెంకటేష్, రెడ్డెమ్మ, నితిన్, అజయ్, రెడ్డి ప్రవీణ, మృదుల, అమరనాథ్, సురేష్‌బాబు, ఉమాదేవి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



వార్డుబాటలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పం: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ సుధీర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో శనివారం వార్డు బాట చేపట్టారు. స్థానికులు మాట్లాడుతూ కోటవీధి, శివాలయం వద్ద ఉన్న రాజ కాలువకు మరమ్మతులు చేయించాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన సుధీర్ రెండు రోజుల్లో రాజ కాలువ పనులు పూర్తి చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో 22వ వార్డు ఇన్‌చార్జ్ అరుల్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం



మాట్లాడుతున్న చైర్ పర్సన్ చాముండేశ్వరి, మండీ సుధా

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు కాలనీలో శనివారం యునాని వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్యులు ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. దీన్నిబట్టి ప్రభుత్వం పేదల వైద్యానికి ఎంతటి ప్రాముఖ్యతనిస్తోందో అర్థం చేసుకోవచ్చన్నారు. కౌన్సిలర్, పార్టీ మాజీ కన్వీనర్ మండీసుధా పాల్గొన్నారు.

## లింగ వివక్షపై అవగాహన సదస్సులు



మాట్లాడుతున్న ఏపీఎం రవి

పుంగనూరు: లింగ వివక్ష చూపకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఏపీఎం రవి తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో శనివారం మండల మహిళా సమాఖ్యల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరిపైనా వివక్ష చూపమని ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ లింగ వివక్షపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డిసెంబర్ 23 వరకు జెండర్ వివక్ష వ్యతిరేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెద్దలతో కలిసి సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు శివశంకర్, గంగాధర్, నాగరత్న, శారద పాల్గొన్నారు.

## పాడి ఆవును కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



ఆవును కాపాడి యజమానికి అప్పగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గంగవరం: మండలంలోని బీడీ కాలనీని ఆనుకుని బీడు భూమిలో ఉన్న బురద గుంతలో పడిపోయిన ఆవును అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. అబ్దుల్ అజీజ్‌కు చెందిన ఆవు శనివారం బీడు భూమిలో గడ్డి మేస్తూ పక్కనే ఉన్న బురదగుంతలో పడిపోయింది. గమనించిన స్థానికులు ఆవును వెలికితీసేందుకు ఎంత ప్రయత్నించినా వీలుకాలేదు. దీంతో పలమనేరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆవును సురక్షితంగా బయటికి తీశారు. ఆవు యజమాని అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సదుం: మానవహారం ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య సభ్యులు

రొంపిచెర్ల: బాల్య వివాహాలను అరికట్టాలని ఏపీఎం బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పెద్దమల్లెల గ్రామంలో శనివారం స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలన్నారు. లింగ వివక్షత చూపరాదని పేర్కొన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి, సీసీ వెంకటనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

**బాల్య వివాహాలు తగదు**

సదుం: బాల్య వివాహాలు తగదని ఏపీఎం హరిప్రసాద్ తెలిపారు. సదుంలో శనివారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం హరిప్రసాద్ మాట్లాడుతూ మహిళా విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని, మహిళల్లో పోషకాహార లోపం తలెత్తకుండా చూడాలన్నారు. బాలికల అక్రమ రవాణాను నిర్మూలించాలన్నారు. అనంతరం బస్టాండులో మానవహారం ఏర్పాటు చేశారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట నరసింహులు

సోమల: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. ఎస్.నడింపల్లె పంచాయతీ సూరయ్యగారిపల్లెలో శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువ జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో చెడ్డీ గ్యాంగ్ సంచరిస్తున్నట్లు సమాచారముందని అప్రమత్తంగా ఉంటూ సమస్య వచ్చినప్పుడు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు లేదా 100 కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో అసాంఘిక సంఘటనలు జరిగితే 9440900699కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కానిస్టేబుల్ రమణ, వాటర్ షెడ్ చైర్మన్ డిసెంబర్ రావు, మనోహర పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని హిమశ్రీతో ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చంద్రగిరిలో జరిగిన అండర్-14 హాకీ పోటీల్లో కావేటిగారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని హిమశ్రీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎంమంజువాణి తెలిపారు. ఆమెను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని మెడల్‌తో సన్మానిస్తున్న హెచ్ఎం

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎ.హరిహర కుమార్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు హెచ్ఎం ఎస్.వేదవతి తెలిపారు. ఈ నెల 23, 24వ తేదీల్లో పల్నాడు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ అండర్-14 బాలుర 4X100 రిలేలో హరిహరకుమార్ ప్రతిభ చూపి మూడో స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థిని పీడీ దొరై, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## రేపు ప్రత్యేక పూజలు

కుప్పం: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం కదిరిబండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడంతో ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

## ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు

పలమనేరు: ఎన్‌సీసీలో చేరడం ద్వారా నాయకత్వ లక్షణాలు కలుగుతాయని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. కళాశాలలో శనివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సేవ చేయడం ద్వారా సమాజానికి మంచి నాయకులుగా ఎదుగుతారని చెప్పారు. ఎన్‌సీసీలో టీఎస్‌సీ, ఐజీసీ క్యాంపుల్లో పాల్గొని మంచి ప్రతిభ చూపిన వలంటీర్లు గౌరి, హరీష్, జ్ఞానేంద్రకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం పాల్గొన్నారు.

## నేడు ఉద్యాన పంటల సాగుపై అవగాహన సదస్సు

వి.కోట: స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం ఉద్యానశాఖ బంగాళాదుంప, టమాట పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు మండల ఉద్యానశాఖాధికారి లక్ష్మీ ప్రసన్న తెలిపారు. ఇందులో బెంగళూరు ఐఐహెచ్ఆర్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

## కల్యాణ వెంకన్న సన్నిధిలో అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఈవో మురళీధర్‌బాబు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్నట్టు కార్యనిర్వాహణాధికారి మురళీధర్‌బాబు తెలిపారు. ఆయన శనివారం మధ్యాహ్నం పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పెళ్లిరోజు, పుట్టినరోజు సమయాల్లో విరాళాలు ఇస్తే వారి మధుర జ్ఞాపకాలను గుర్తు చేస్తూ ఆలయంలో పూజలతో పాటు వారి పేరున అన్నదానం చేస్తామన్నారు. వివరాలకు 8801389444లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

## పక్కాగా కుల గణన చేపట్టాలి

రొంపిచెర్ల: మండలంలో కుల గణనను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో రాజేంద్ర ఆదేశించారు. రొంపిచెర్ల పంచాయతీ కార్యాలయంలో శనివారం కుల గణనపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఇబ్రహీంఖాన్, కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కరీముల్లా, వీఆర్వోలు శ్రీనివాసులు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం



అత్తినత్తం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె: పేదలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగనన్న ప్రతి గ్రామంలోనూ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ తెలిపారు. ఆయన శనివారం దాసిమానిపల్లె పంచాయతీలోని అత్తినత్తంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో హెల్త్ క్లినిక్ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు నిత్యం సేవలు చేసే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. చంద్రబాబునాయుడు ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. అలాంటి వ్యక్తికి ఈసారి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, సర్పంచ్ దేవరాజు, సింగిల్‌విండో చైర్మన్ క్రిష్ణమూర్తి, ఎంపీటీసీ రాజేశ్వరి సుందరం పాల్గొన్నారు.

**ఆర్థిక సాయం**

రామకుప్పం: మండలంలోని పెద్దతండా పంచాయతీ అడ్డగట్టు తండాకు చెందిన కేశలమ్మ శనివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్సీ భరత్ గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల కోసం రూ.10 వేల అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబు రెడ్డి, సర్పంచ్ మోహన్‌నాయక్, నేతలు భాస్కర్‌నాయక్, వెంకటేశు నాయక్, కామరాజు నాయక్, కుమార్ నాయక్ పాల్గొన్నారు.

**నూతన బోరుకు పూజలు**

రామకుప్పం: మండలంలోని విజలాపురం పంచాయతీ సంతమిట్ట గ్రామంలో బోరు ఏర్పాటుకు శనివారం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పూజలు చేశారు. అనంతరం బోరు డ్రిల్ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, స్థానిక సర్పంచ్ విజలాపురం బాబు రెడ్డి మాట్లాడుతూ జెడ్పీ నిధులతో నూతన బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ మండల కో-కన్వీనర్ చంద్రారెడ్డి, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, నేతలు మురుగేష్, బోర్‌వెల్ చెంగారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## భరత్‌ను ఆశీర్వదించండి



ప్రీతిచామనూరులో చీరలు అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ



నగదు అందజేస్తున్న దుర్గ

శాంతిపురం: కుప్పం ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తున్న ఎమ్మెల్సీ భరత్‌కు అండగా నిలిచి ఆశీర్వదించాలని ఆయన భార్య దుర్గ కోరారు. ఆమె శనివారం కర్లగట్ట పంచాయతీ ప్రీతిచామనూరు, తంబిగానిపల్లిలో జగనన్నతో జనం- భరతన్నతో మనం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు చీరలు అందించారు. ప్రీతిచామనూరు వద్ద పొలాల్లో నివాసం ఉంటున్న వారి వద్దకు కాలినడకన వెళ్లి మాట్లాడారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కుప్పం అభివృద్ధికి భరత్ కృషి చేస్తున్నారని వివరించారు. కరోనా వంటి విపత్తు సమయంలో కూడా భరత్ ప్రజల్లోనే ఉంటూ అందరికీ నిత్యావసరాలు, వైద్యం అందేలా చూశారని గుర్తు చేశారు. మేలు చేసిన వారిని ఆదరించాలని కోరారు. ఎంపీటీసీ చలం, నాయకులు చలపతి, మురుగేష్, గోవిందన్, ఆర్ముగం, కృష్ణప్ప పాల్గొన్నారు.

**మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం**

శాంతిపురం: కర్లగట్ట పంచాయతీ చిన్నకర్లగట్టలో అనారోగ్యంతో మృతి చెందిన వెంకటమ్మ(58) కుటుంబానికి ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ఆర్థిక సాయం చేశారు. ఆమె శనివారం గ్రామానికి చేరుకుని వెంకటమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు సాయం చేశారు. సంపంగి, వెంకటప్ప, గోవిందరాజు, రాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



సదుం: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశులు మాట్లాడుతూ భారతీయుల ఆశయాలకు ప్రతీకగా రాజ్యాంగం ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయశేఖరం, పొలిటికల్ సైన్సు విభాగాధిపతి నాగరత్నం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా రాజ్యాంగ దినోత్సవం**

సదుం: స్థానిక వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం భారత జాతీయ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ యశితప్రియ మాట్లాడుతూ విద్యార్థులకు భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను తెలియజేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను దుర్వినియోగం చేయరాదన్నారు. అనంతరం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




మాట్లాడుతున్న జడ్జి కార్తీక్

పుంగనూరు: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్ తెలిపారు. స్థానిక బసవరాజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారందరూ డ్రైవింగ్ లైసెన్సు తీసుకుని వాహనాలను నడపాలన్నారు. మహిళలను అదనపు కట్నం కోసం వేధించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, మంచివారితో స్నేహం చేయాలని, బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రిన్సిపాల్ దయానందరాజు తదితరులు పాల్గొన్నారు.

**మహిళల సంరక్షణ చట్టాలపై అవగాహన**

పలమనేరు: సమాజంలో మహిళల సంరక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది భర్కత్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశతోపాటు అనేక చట్టాలను అమలు చేస్తోందన్నారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఏటా నవంబరు 25న అంతర్జాతీయ మహిళా వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు వెంకటేశులు, విజయశేఖరం, అధ్యాపకులు పాల్గొన్నారు.